క్లుప్తంగా

గోవు సర్వ దేవతా స్వరూపం



మారెల్లలో గో పూజలో పాల్గొన్న మహిళలు

తుగ్గలి : గోవు సర్వ దేవతా స్వరూపమని, గోమాతను పూజిస్తే సకల సుఖాలు సిద్ధిస్తాయని ధార్మికోపన్యాసకులు డాక్టర్ తొగట సురేష్‌బాబు అన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మారెల్ల గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. శ్రీమద్రామాయణం, భారతం, భగవద్గీత ప్రవచనాలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. అనంతరం మహిళలు గోమాతను భక్తిశ్రద్ధలతో పూజించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలూరులో వర్షం



హత్తిబెళగల్ సమీపంలో పొంగిన కల్లెవంక

ఆలూరు రూరల్: మూడు రోజుల నుంచి ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఊరట లభించింది. గురువారం రాత్రి మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. వంకలు,వాగులు పొంగి పొర్లాయి. హత్తిబెళగల్ సమీపంలోని కల్లెవంక ఉధృతంగా ప్రవహించింది. ఈ నెల నుంచి రబీ సీజన్ ప్రారంభం కావడంతో గురువారం కురిసిన వర్షంతో పొలాలు విత్తుకు అదునుగా మారాయి.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఆలూరులో నిల్వ నీటిని తొలగింపజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలూరు రూరల్: దోమలు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. శుక్రవారం ఆలూరులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉంచుకోరాదన్నారు. డ్రమ్ముల, పాత టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉంటే లార్వా వృద్ధి చెంది దోమలు ప్రబలుతాయన్నారు. రాత్రి పూట దోమల తెరలు వాడాలన్నారు. రోజు విడిచి రోజు జ్వరం వస్తే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని చెప్పారు. సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

రాయితీ శనగ పంపిణీ



ఆస్పరిలో శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

తుగ్గలి : రాయితీ శనగ విత్తనాలను శుక్రవారం తుగ్గలి, రాతన గ్రామాల రైతులకు పంపిణీ చేశారు. మండలానికి 6,500 క్వింటాళ్ల పప్పుశనగ మంజూరు కాగా, 25 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతులకు అందిస్తోందని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు రవి, అన్వర్ బాషా, ఎంపీపీ నాగప్ప, ఎంపీటీసీ సభ్యులు రాజు, నాయకులు బత్తిన వెంకటరాముడు, నాగేంద్ర, మనోహర చౌదరి పాల్గొన్నారు.

విత్తనాలకు రిజిస్ట్రేషన్..

ఆస్పరి: మండల కేంద్రంతో పాటు జొహరాపురం, శంకరబండ, చిగిళి, బిణిగేరి, చిన్నహోతూరు, నగరూరు, బనవనూరు, కారుమంచి, హలిగేర గ్రామాలలో శుక్రవారం సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని ఏఓ నరేంద్రకుమార్ తెలిపారు. మండలానికి 4,200 క్వింటాళ్ల శనగలు మంజూరైయ్యాయన్నారు. శుక్రవారం 466 మంది రైతులకు 760 క్వింటాళ్ల విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులుకు త్వరలోనే విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు.

అక్కినేని కుటుంబానికి క్షమాపణ చెప్పాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండ సురేఖ అక్కినేని కుటుంబానికి తక్షణమే క్షమాపణ చెప్పాలని అక్కినేని సంఘం రాయలసీమ జిల్లాల కార్యదర్శి వెల్దుర్తి షేక్ ఉస్మాన్ బాషా డిమాండ్ చేశారు. వెల్దుర్తిలో శుక్రవారం సంఘం సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంత్రిగా ఉండి నిరాధార వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఈశ్వర్, మహేష్, బాషా, వెంకటేష్, చలపతి, అనిల్, గౌరీ శంకర్ పాల్గొన్నారు.

ఆశలన్నీ రబీపైనే

ఈ ఏడాది ఖరీఫ్ రైతులకు కలిసి రాలేదు. ఆరంభంలో తీవ్ర వర్షాభావం కారణంగా పూర్తిస్థాయిలో పంటలు సాగు కాలేదు. అరకొరగా వేసిన పంటల్లో.. కొన్ని ఎండిపోగా.. మిగిలినవి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీటమునిగాయి. ఈ సమయంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం నుంచి సహకారం కొరవడటంతో భూములు ఖాళీగా ఉంచుకున్నారు. రబీ ప్రారంభమవడం, వెంటనే అదునైన వానలు పడటంతో విత్తనాలు వేసుకోవడానికి అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా శనగ సాగు చేస్తారు. రెండో పంటైనా కలిసొస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- సబ్ డివిజన్‌లో రబీ సాగుకు ప్రణాళిక సిద్ధం
- ఈ ఏడాది 54 వేల హెక్టార్లలో సాగు కానున్న పంటలు
- ఆలూరు నియోజకవర్గానికి 23 వేల క్వింటాళ్ల శనగ విత్తనాల కేటాయింపు
- అన్నదాతలకు కలిసిరాని ఖరీఫ్



ఆలూరు వద్ద పప్పుశనగ విత్తనం వేస్తున్న రైతు (ఫైల్)

ఆలూరు రూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు మురిపించాయి. దీంతో ఎన్నో ఆశలతో రైతులు పంటలు సాగు చేశారు. ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు ఎండిపోగా ఇంకా సాగు చేయాల్సిన భూములు ఖాళీగా ఉంచుకోవాల్సి వచ్చింది. ఇక సీజన్ చివర్లో తుఫాను ప్రభావంతో 30 శాతం పంటలు నీటి మునిగిపోయాయి. పెట్టుబడి కూడా రాక నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం వద్ద ప్రణాళిక కొరవడటంతో రైతులు మళ్లీ విత్తనాలు వేయలేకపోయారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఆలూరు నియోజకవర్గంలో పంటల సాగు వందశాతం కూడా కాలేదు. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 82 వేల హెక్టార్లు కాగా.. 46 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు వేశారు. సెప్టెంబర్ 30తో ఖరీఫ్ సీజన్ ముగియగా.. ఇక రైతన్నల ఆశలన్నీ రబీపైనే ఉన్నాయి. ఈ మొదటి వారం నుంచి సీజన్ ప్రారంభమైంది. ప్రారంభంలోనే బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు మూడు రోజుల క్రితం అడపాదడపా వర్షాలు కురిశాయి. దీంతో అన్నదాతల్లో ఆశల మొలకెత్తాయి.

రబీ సాగుకు సిద్ధం..

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రబీ పంటల సాగుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎక్కువగా సాగయ్యే పప్పుశనగ విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపించారు. రెండు రోజుల క్రితం విత్తనాలు ఆయా మండల కేంద్రాలకు చేరుకున్నాయి. గురువారం నుంచి రాయితీ విత్తనాలు అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించారు.

23 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలు..

రబీ సీజన్‌లో ఆలూరు ప్రాంతంలో అత్యధిక శాతం రైతులు పప్పు శనగ సాగు చేస్తారు. ఈ ఏడాది 54 వేల హెక్టార్లకు పైగా పంట సాగుయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. ఇందు కోసం 34,500 క్వింటాళ్ల శనగ విత్తనాలు అవసరం కాగా.. ప్రస్తుతం 23 వేల క్వింటాళ్ల విత్తనాలు, 2 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేయించినట్లు చెప్పారు.

మండలాల వారీగా విత్తనాల కేటాయింపు (క్వింటాళ్లలో..)

మండలం	పప్పుశనగ	వేరుశనగ విత్తనాలు
ఆలూరు	8,762	155 క్వింటాళ్లు
ఆస్పరి	6,300	130
చిప్పగిరి	4,450	-
హాలహర్వి	3,250	225
హొళగుంద	140	20
దేవనకొండ	520	1,460

విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నాం



ఈ ఏడాది రబీ సీజన్‌లో 54 వేల హెక్టార్లలో పంటలు సాగు చేస్తారు. సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలు ,ఎరువులు సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం 23 వేల క్వింటాళ్ల పప్పుశనగ, 2 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు ముందుకు వచ్చి రాయితీ విత్తనాలు తీసుకోవాలి. అవసరమైతే మరిన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– సునీత,ఏడీఏ,ఆలూరు

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

తుగ్గలి : వివిధ మరమ్మతుల నిమిత్తం శనివారం త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో మార్పులు ఉంటాయని ఆ శాఖ మండల ఏఈ మహేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. తుగ్గలి సబ్ స్టేషన్ పరిధిలో తెల్లవారుజామున 3 నుంచి 9గంటల వరకు, జొన్నగిరి సబ్ స్టేషన్ పరిధిలోని జీ.ఎర్రగుడి, మదనంతపురం ఫీడర్లకు అర్ధరాత్రి నుంచి 9గంటల వరకు, జొన్నగిరి, పగిడిరాయి ఫీడర్లకు తెల్లవారుజాము నుంచి 9 గంటల వరకు, పెండేకల్లు సబ్ స్టేషన్ పరిధిలో పెండేకల్లు, రామలింగాయపల్లి ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. మిగిలిన సమయాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సబ్సిడీ శనగ మంజూరు

హొళగుంద: రబీ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ కింద మండలానికి 140 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు మంజూరైనట్లు ఏఓ ఆనంద లోకదళ్ శుక్రవారం తెలిపారు. బయోమెట్రిక్ విధానంతో పంపిణీ చేస్తామని, అర్హులైన రైతులు ఆధార్, పొలం ధ్రువ పత్రాలతో గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించాలని సూచించారు. నల్ల పొలాల రైతులకు క్వింటా రూ.7050 ప్రకారం అందిస్తామని చెప్పారు.

నేడు పొదుపు మహిళలతో సమావేశం

ఆలూరు: స్థానిక ఉపాధ్యాయ నగర్ కాలనీలోని వెలుగు ఏరియా కార్యాలయంలో శనివారం వివిధ గ్రామాలకు చెందిన మండల సమాఖ్య గ్రూపు లీడర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం నవీన్ శుక్రవారం తెలిపారు. గతంలో సభ్యులు పొందిన రుణాల రికవరీపై చర్చ ఉంటుందని, సీసీలు, ఎంబీకేలు హాజరు కావాలని చెప్పారు.

మహాలక్ష్మీదేవిగా కన్యకాపరమేశ్వరి



తుగ్గలిలో గాయత్రీ దేవిగా దుర్గామాత



పత్తికొండ కన్యకాపరమేశ్వరీదేవీ ఆలయంలో మహాలక్ష్మిగా అమ్మవారు




జ్వాలామాలిని దేవి అలంకరణలో వాసవీదేవి



వెల్దుర్తిలో గాయత్రీ దేవిగా భువన గాయత్రీ దేవి



గాయత్రీ మాత అలంకారంలో సుంకులా పరమేశ్వరి



ఆస్పరిలో అన్నపూర్ణా దేవి అలంకారంలో మారెమ్మవ్వ



నిజరూపంలో దర్శనమిచ్చిన గాయత్రీ మాతకు పూజలు చేస్తున్న దృశ్యం



పెరవలిలో గాయత్రీ దేవిగా రాజరాజేశ్వరి దేవి



మద్దికెరలో దుర్గాదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి



వెల్దుర్తిలో బాలాత్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరి



కటారుకొండలో బాలాత్రిపురసుందరిగా దుర్గాదేవి

పత్తికొండ/తుగ్గలి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం పత్తికొండ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవీ ఆలయంలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్యం సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని పూలు, నగలు, డబ్బు నోట్లతో విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే.. తుగ్గలిలో ప్రత్యేక మండపంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారు రెండో రోజు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఆస్పరి: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి, మారెమ్మవ్వ, రామతీర్థంలోని పార్వతీదేవి అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. రామతీర్థంలోని గాయత్రీ మాత నిజరూపంలో దర్శనమిచ్చారు. పూజారులు అమ్మవార్లకు గంగ,ఆకు పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజలు జరిపించారు.

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో శుక్రవారం రాజరాజేశ్వరిదేవి గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, అష్టోత్తరనామార్చనతో పాటు ప్రత్యేక పూజలు చేసి మహామంగళ హారతి ఇచ్చారు. అలాగే చౌడేశ్వరీ దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

ఆలూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవీ ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు నరేంద్ర శాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారిని జ్వాలామాలిని దేవీగా అలంకరించారు.అంతకు ముందు అమ్మవారికి గంగపూజ, ఆకులు,ఫల,పుష్ప, పంచామృతాభిషేకం,మహోమం గళహారతి తదితర పూజలు జరిపించారు. నిర్వాహకులు జనార్దన్ శెట్టి, భాస్కర్‌శెట్టి, నాగేంద్రయ్యశెట్టి, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

కృష్ణగిరి: దేవి శరన్నరాత్రి ఉత్సవాలను వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో భక్తులు ఘనంగా జరుపుకుంటున్నారు. ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెల్దుర్తి అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరి బాలాత్రిపురసుందరిగా, జాతీయ రహదారి పక్కనున్న భువన గాయత్రీ దేవాలయంలో గాయత్రీ దేవిగా, కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామంలో దుర్గాదేవి బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అన్నదానం చేశారు.

గాయత్రీమాత అలంకరణలో సుంకులా పరమేశ్వరి

దేవనకొండ: మండల కేంద్రంలో సుంకులా పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం గాయత్రీ మాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



ఎంపీడీఓ గీతావాణికి వినతి పత్రం ఇస్తున్న వలంటీర్ల అసోసియేషన్ నాయకులు

ఆస్పరి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను విధుల్లోకి తీసుకోవడమే కాకుండా నెలకు రూ.10వేలు గౌరవవేతనం ఇవ్వాలని వలంటీర్ల అసోసియేషన్ మండల గౌరవాధ్యక్షుడు రమేష్, నాయకులు శివకుమార్, కృష్ణమూర్తి, సంజయ్, వెంకటేష్, రాము, వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గీతావాణికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 5 సంవత్సరాలుగా నెలకు రూ.5వేల వేతనంతో పని చేసి ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలైన వలంటీర్ల విషయం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు







ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఈఓ ప్రభాకర్, ఎంపీడీఓ విశ్వమోహన్



తుగ్గలిలో ఎంపీడీఓ సావిత్రిని సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ, ఎంపీడీఓ

కృష్ణగిరి ఎంపీడీఓగా మోహన్‌కుమార్,

కృష్ణగిరి: ఎంపీడీఓగా జి. మోహన్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న విశ్వమోహన్ తుగ్గలి మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం నుంచి మోహన్‌కుమార్ బదిలీపై వచ్చారు. ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. నూతన ఎంపీడీఓకు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేతా సుభాషిణి, మండలస్థాయి అధికారులు, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

వెల్దుర్తి ఎంపీడీఓగా సుహాసినమ్మ..

వెల్దుర్తి మండల ఎంపీడీఓగా ఎంహెచ్ సుహాసినమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈమె హొళగుంద నుంచి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. అలాగే వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీ ఈఓగా గడివేముల మండలం నుంచి తారాకేశ్వరి, అలాగే మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా నందవరం మండలం నుంచి వెంకటరాముడు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

ఆలూరు ఈఓగా ప్రభాకర్

ఆలూరు రూరల్: ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓగా ప్రభాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఆలూరుకు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ

తుగ్గలి : ఎంపీడీఓగా నియమితులైన విశ్వమోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన సావిత్రి దొర్నిపాడుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కృష్ణగిరిలో పనిచేస్తున్న విశ్వమోహన్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే ఈవోపీఆర్డీగా శ్రీహరి బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొలిమిగుండ్ల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎంపీడీఓ కార్యాలయ ఏవోగా మహబూబ్‌షా విధుల్లో చేరారు. ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి చిప్పగిరి మండలానికి బదిలీ అయ్యారు.

అధికారులకు సన్మానం

తుగ్గలి : సాధారణ బదిలీల్లో భాగంగా తుగ్గలి ఎంపీడీఓ సావిత్రి దొర్నిపాడుకు, ఏపీఓ రామకృష్ణ ఆస్పరి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి చిప్పగిరి మండలాలకు బదిలీ అయ్యారు. దీంతో శుక్రవారం వారి ని ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ నాగప్ప, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీ ఓ విశ్వమోహన్, ఈవోపీఆర్డీ శ్రీహరి, కార్యాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

చిప్పగిరి: ఎంపీడీఓగా అల్లాబకాష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీవీ. కొండయ్య పత్తికొండ తాలూకా మద్దికెరకు బదిలీపై వెళ్లగా ఆలూరులో ఎంపీడీఓగా పని చేస్తున్న అల్లాబకాష్ చిప్పగిరికి బదిలీపై వచ్చారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ కె. వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేద్దామని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులు తమ విధులు, బాధ్యతలు తెలుసుకుని నడవాలని సూచించారు. సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడంతో మరో మారు ఇలా జరగకుండా చూసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్‌కు సూచించారు. జెడ్పీటీసీ కేతా సుభాషిణి మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశాలకు అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. ప్రధాన శాఖలకు సంబంధించిన అధికారులు లేకపోవడంతో ప్రజా ప్రతినిధుల సమస్యలు ఎవ్వరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. వైస్ ఎంపీపీలు బోయ సుశీల, కత్తి రాజేష్, మండల కో-అప్షన్ మెంబర్ షేక్ షాలుమియ్యా, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

ఎమ్మిగనూరురూరల్: పత్తి, వరి, వేరుశనగ పంటల్లో తెగుళ్ల నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాత అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో రైతు సేవా కేంద్రాల సహాయకులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున పంటలకు తెగుళ్లు సోకుతున్నాయని చెప్పారు. వాటి నివారణకు సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. రైతు సేవా కేంద్రాల సహాయకులు రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. రైతులు తెగుళ్ల నివారణకు మితిమీరి రసాయన ఎరువులు ఉపయోగించకుండా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. పంటల నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని, నమోదు చేయించుకుంటే ప్రభుత్వం నుంచి సబ్సిడీ పథకాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, మంత్రాలయం ఏఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వసూలు చేయాలి

హొళగుంద: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీకి చాలా కాలంగా రావాల్సిన ఆదాయానికి సంబంధించి వేలం సొమ్ము, మొండి బకాయిలను వెంటనే వసూలు చేసి గ్రామాభివృద్ధికి వినియోగించాలని తుంగభద్ర రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గాలి వీరభద్రగౌడ్, ఎర్రిస్వామి, సూరన్న, సోము, ఉమా తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గతంలో వారపు సంత మార్కెట్, తదితర వాటిని వేలం దక్కించుకున్నారని, వారితో పాటు వివిధ కారణాలతో పంచాయతీకి చాలా మంది బకాయిలు ఉన్నా..అధికారులు ఎందుకు వసూలు చేయడం లేదని ప్రశ్నించారు.

పైపులైన్ ఏర్పాటు చేయండి

మద్దికెర : స్థానిక బీసీ వసతి గృహంలోని వృథా నీరు బయటికి పోవడానికి పైపులైన్ ఏర్పాటు చేయాలని సంక్షేమ అధికారి రాజశేఖర్‌రెడ్డి తహసీల్దార్ హుసేన్‌సాహెబ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. గతంలో పక్కనేనున్న బావిలోకి నీరు వెళ్లేదని, ప్రస్తుతం బావి పూడ్చటం వల్ల హాస్టల్ డ్రైనేజీ నీరు బయటకు పోవడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పైపులైను ఏర్పాటు చేసి నీటిని మళ్లించాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

జాబ్ మేళాలో 204 మందికి ఉద్యోగాలు

ఎమ్మిగనూరుటౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 204 మందికి ఉద్యోగాలు లభించాయి. 17 కంపెనీల ప్రతినిధులు 402 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా వారిలో 204 మందికి ఉద్యోగాలు లభించాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయితేజా తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు



ఇద్రూస్ బాషాను 108లో తరలిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): కుక్కను తప్పించబోయి బైక్‌పై నుంచి కింద పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కొసనాపల్లి గ్రామానికి చెందిన ఇద్రూస్ బాషా శుక్రవారం సాయంత్రం పని నిమిత్తం వెల్దుర్తి వచ్చి స్వగ్రామానికి వెళ్తుండగా.. చెరుకులపాడు వద్దనున్న పెద్దమ్మ గుడి సమీపంలో కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను దారి వెంట వెళ్లే వారు గమనించి 108కి సమాచారం అందించారు. 108 వాహనం అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని కర్నూలు వైద్యశాలకు తరలించినట్లు పైలెట్ ఉస్మాన్ బాషా తెలిపారు.

చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి

దేవనకొండ: ఈనెల 2న మండలంలోని గద్దెరాళ్ల స్టేజి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. క్షతగాత్రుడు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిడుగుపాటుకు మేకలు మృతి

మంత్రాలయం: కౌతాళం మండలం బదినేహాల్‌లో పిడుగుపాటుకు గురై మేకలు మృత్యువాత పడ్డాయి. వివరాలివి.. కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన బడేసాబ్ భార్య అమీనాబి 30 మేకల మందను మేపేందుకు తీసుకెళ్లింది. మధ్యాహ్న సమయంలో ఉరుములు, మెరుపులతో వాన కురవగా మేకలు అక్కడున్న చెట్టు కిందకు చేరుకున్నాయి. ఆ సమయంలో భారీ శబ్దంతో మందపై పిడుగు పడటంతో 5 మేకలు మృతిచెందాయి. అమీనాబి కాస్త దూరంగా ఉండటంతో ప్రాణాలతో బయటపడింది. మేకల మృతితో రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని బాధితురాలు వాపోయింది.